
మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక

## సర్ ప్రక్రియను త్వరగా చేసుకోండి



4లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర    సంపుటి : 08    సంచిక : 346    బుధవారం    15 - 07 - 2026    పేజీలు: 8    వెల: 4





# ప్రజా సేవలపై సీఎం సమీక్ష

- అధికారులకు కీలక ఆదేశాలు
- వేగవంతమైన, పారదర్శక సేవలపై దృష్టి
- యూరియా లభ్యతతో పాటు శాఖల పనితీరుపై సమీక్ష

మన గళం, అమరావతి : రాష్ట్ర ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో మంగళవారం నిర్వహించిన సమీక్ష

2 లో..

## పవన్ ఆరోగ్యానికి ప్రత్యేక పూజలు



- జనసేన నేతలు, కార్యకర్తల ప్రార్థనలు
- ఆంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజ

మన గళం, గుంటూరు : జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ గుంటూరులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నాజ్

2 లో..

## మత్స్యకారులకు జగన్ అండ

- రూ.49 లక్షల సాయం ప్రకటన
- బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి

మన గళం, విశాఖపట్నం : విశాఖపట్నం తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో బాధితులైన మత్స్యకార కుటుంబాలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్

2 లో..



## పాత పెన్షన్‌కు ప్రభుత్వ నిర్ణయం

- పయ్యావుల కేశవ్‌కు ఉద్యోగుల కృతజ్ఞతలు
- 11 వేల మంది ఉద్యోగులకు లాభం

మన గళం, అమరావతి : రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు రాష్ట్ర ఆర్థిక

2 లో..



## కోవిడ్ టీకాపై స్పష్టత

- టీకాలతో గుండెపోటు ప్రమాదం లేదన్న అధ్యయనం
- 25 ఆస్పత్రుల్లో దేశవ్యాప్త పరిశోధన
- ధూమపానం, జీవనశైలే ప్రధాన ప్రమాదకారకాలు

మన గళం, న్యూఢిల్లీ : కోవిడ్-19 టీకాల వల్ల గుండెపోటు లేదా రక్తం గడ్డకట్టే ఘటనలు పెరిగాయన్న ప్రచారానికి భారత వైద్య పరిశోధనా మండలి

5 లో..




## అమరావతి నిర్మాణానికి కొత్త ఊపు

8 లో..



## ఏళ్ల పగ.. నాలుగు ప్రాణాలు బలి



2 లో..

## భారీ క్రెడిట్ అవుట్‌రీచ్‌కు సన్నాహాలు

- గొట్టిపాటి రవికుమార్ సమగ్ర సమీక్ష
- నిర్మలా సీతారామన్, చంద్రబాబు హాజరుకానున్న కార్యక్రమం




మన గళం, నరసరావుపేట : జూలై 17న పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం విజయవంతానికి రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి కార్యక్రమ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రుణ, స్వయం ఉపాధి, అభివృద్ధి పథకాల లబ్ధిదారులకు ఈ


2 లో..

## శ్రీవారికి కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

- ఆగమశాస్త్రం ప్రకారం పవిత్ర క్రతువు - ఉత్సవాలకు ఆలయ శుద్ధి నిర్వహణ

మన గళం, తిరుమల : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆగమశాస్త్ర సంప్రదాయాల ప్రకారం కోయిల్ ఆల్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఉత్సవాలకు ముందు ఆలయ పవిత్రతను కాపాడేందుకు నిర్వహించే ఈ ప్రత్యేక శుద్ధి కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కోయిల్ ఆల్వార్ తిరుమంజనం సందర్భంగా గర్భాలయం పరిసరాలతో పాటు ఆలయంలోని మండపాలు, గోడలు, తలుపులు,

2 లో..



## వేదికపై భావోద్వేగ క్షణం

- 2,144 మందికి నియామక ఉత్తర్వులు - వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్

మన గళం, చెన్నై : తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన వైద్యారోగ్య శాఖ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో హృదయాన్ని హత్తుకునే సంఘటన చోటుచేసుకుంది. నియామక పత్రం అందుకునేందుకు వేదికపైకి వచ్చిన ఓ జూనియర్ వైద్యుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌ను చూసి భావోద్వేగానికి గురయ్యాడు. “మిమ్మల్ని ఒక్కసారి కౌగిలించుకోవచ్చా?“ అని అడగగా, ముఖ్యమంత్రి చిరునవ్వుతో

3 లో..



## పవన్ ఆరోగ్యానికి ప్రత్యేక పూజలు



సెంటర్ ఆంజనేయస్వామి ఆలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో ఆకు పూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. భుజానికి శాస్త్రీయ చికిత్స చేయించుకున్న పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు చేపట్టారు. జనసేన గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి చామర్తి ఆనంద్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పవన్ కళ్యాణ్ పేరుతో ఆంజనేయస్వామికి ప్రత్యేక ఆకు పూజ నిర్వహించి ఆయన ఆరోగ్యం కోసం ప్రార్ధనలు చేశారు. దేశ, రాష్ట్ర ప్రజలకు సేవలు అందించే శక్తి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో గుంటూరు నగర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొని పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులంతా ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూనే త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.పూజలు అనంతరం ఆలయంలో ప్రత్యేక హారతులు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని కార్యకర్తలు ఆకాంక్షించారు. జనసేన శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహిస్తున్నాయి. గుంటూరులో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఆయన త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

## మత్స్యకారులకు జగన్ అండ



పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇస్తూ ఆర్థిక సాయం ప్రకటించారు. పడవ ప్రమాదంలో మరణించిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు, ప్రాణాలతో బయటపడిన చిన్నాకు కలిపి ఒక్కో కుటుంబానికి రూ. 7 లక్షల చొప్పున మొత్తం రూ. 49 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని వైఎస్ జగన్ ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మత్స్యకార కుటుంబ సభ్యులతో మాట్లాడిన వైఎస్ జగన్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో ఎదురైన కష్టాలను విన్న ఆయన వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వైఎస్ జగన్ పరామర్శతో మత్స్యకార కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. తమ కష్టకాలంలో వచ్చి ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థిక సాయం ప్రకటించడం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఆయన రాకతో తమ జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయని కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రమాద బాధితులకు ప్రభుత్వం కూడా అవసరమైన సహాయ సహకారాలు అందించి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మత్స్యకారుల భద్రత కోసం దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## భారీ క్రెడిట్ అవుట్‌రీచ్‌కు సన్నాహాలు

కార్యక్రమంలో రుణాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరుకానుండటంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రముఖులు పాల్గొనే కార్యక్రమం కావడంతో భద్రతా ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని, సభా ప్రాంగణంలోకి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, లబ్ధిదారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాలను ముందుగానే గుర్తించి, ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా బ్యాంకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల వివరాల ధృవీకరణ, పత్రాల పరిశీలన, రుణాల మంజూరు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ సేవలపై సంతృప్తితో వెళ్లేలా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, వ్యవసాయం, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీ ద్వారా ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణ కోసం ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

# శ్రీవారికి కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

ఇతర పవిత్ర ప్రాంతాలను సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన ప్రత్యేక మిశ్రమంతో శుభ్రపరిచారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన ఉత్సవాలకు ముందు ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ శుద్ధి ద్వారా ఉత్సవాలకు ఆధ్యాత్మికంగా సిద్ధమవుతారని ఆలయ పండితులు పేర్కొంటున్నారు.

కోయిల్ ఆల్వార్ తిరుమంజనం అనంతరం ఆలయంలోని అన్ని ప్రాంతాలను తిరిగి అలంకరించి, నిత్యకైంకర్యాలకు సిద్ధం చేశారు. కార్యక్రమం పూర్తయ్యాక భక్తులకు యథావిధిగా శ్రీవారి దర్శనాన్ని కల్పించారు. ఈ పవిత్ర క్రతువు సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధల మధ్య వేద మంత్రోచ్చారణలు, ఆగమ విధానాలు నిర్వహించబడ్డాయి. ఆలయ పవిత్రతను పరిరక్షిస్తూ శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాల్లో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా భావిస్తారు. ప్రతి ప్రధాన ఉత్సవానికి ముందు తిరుమల తిరుపతి దేవస్థానం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తోంది. శ్రీవారి ఆలయంలో జరిగే ఈ పవిత్ర శుద్ధి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి భావంతో పాల్గొన్నారు.

# పాత పెన్షన్‌కు ప్రభుత్వ నిర్ణయం

శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2004 సెప్టెంబర్ 1కు ముందు ఏపీపీఎస్సీ, డీఎస్సీ నోటిఫికేషన్ల ద్వారా ఎంపికై ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించారు. ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వ నిర్ణయం వల్ల వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కలిగిందని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం అమలుతో ఉద్యోగుల భవిష్యత్ మరింత భద్రంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీఎస్ఈఏ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 11 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రయోజనం పొందనున్నారని ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఉద్యోగుల కుటుంబాల్లో ఈ నిర్ణయం సంతోషాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధ్యమైనంత మేరకు అమలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ భద్రతకు అవసరమైన నిర్ణయాలను తీసుకుంటూ పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ప్రజాసేవలపై సీఎం సమీక్ష

సమావేశంలో పలు శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. సేవల నాణ్యతను పెంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ, రహదారులుభవనాల శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖలు అందిస్తున్న సేవలను ముఖ్యమంత్రి విడివిడిగా పరిశీలించారు. ప్రతి శాఖ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

రాష్ట్రంలో యూరియా లభ్యతపై కూడా ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. రైతులకు అవసరమైన సమయంలో ఎలాంటి కొరత లేకుండా ఎరువుల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ సేవల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత విస్తరించాలని చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు సేవలు వేగంగా, పారదర్శకంగా అందించేందుకు డిజిటల్ విధానాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి శాఖ పనితీరును నిరంతరం సమీక్షిస్తూ లోపాలను వెంటనే సరిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు నిర్ణీత సమయంలో అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.



ప్రజల అవసరాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారదర్శక పాలన, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.


# ఏళ్ల పగ.. నాలుగు ప్రాణాలు బలి

**- తల్లిదండ్రులను చంపిన ఏనుగు.. - మళ్లీ కోడలు, మనవడిపై దాడి**

మన గళం : చిత్వాన్ : నేపాల్‌లో ఓ ఏనుగు ఒకే కుటుంబాన్ని వరుసగా లక్ష్యంగా చేసుకుని నాలుగు ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన కలచివేస్తోంది. చిత్వాన్ జాతీయ ఉద్యానవనం సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబంపై 'ధ్రుబే' అనే అడవి ఏనుగు రెండు దశాబ్దాల వ్యవధిలో రెండుసార్లు దాడి చేసి ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని చంపింది. ఈ ఘటన నేపాల్‌లో మానవవన్యప్రాణుల ఘర్షణ తీవ్రతను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. 2012 డిసెంబర్‌లో మాడి ప్రాంతంలో శనిచర బోటే తల్లిదండ్రులపై ధ్రుబే ఏనుగు దాడి చేసి వారిని చంపేసింది. ఆ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన కుటుంబం ఇక అక్కడ ఉండడం సురక్షితం కాదని భావించి తమ నివాసాన్ని మార్చుకుంది. రాప్తి నదిని దాటి దాదాపు తొమ్మిది మైళ్ల దూరంలో ఉన్న జగత్‌పూర్‌కు వెళ్లి కొత్త జీవితం ప్రారంభించింది. ఏళ్ల తరబడి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఇక తమకు ముప్పు తప్పిందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఈ నెల ప్రారంభంలో అదే ధ్రుబే ఏనుగు జగత్‌పూర్‌కు చేరుకుని శనిచర ఇంటిపై దాడి చేసింది. ఈ ఘటనలో ఆయన 25 ఏళ్ల కోడలు ఆషికా బోటే, నాలుగేళ్ల మనవడు భరత్ బోటే అక్కడికక్కడే మృతి చెందారు. ఒక్కసారిగా మరోసారి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై శనిచర బోటే ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాణాలు కాపాడుకోవడానికి నది దాటి చాలా దూరం వెళ్లాం. ఇక ప్రమాదం ఉండదనుకున్నాం. కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి నా కోడలు, మనవడిని బలిగొంది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా భయం వెంటాడుతోంది" అని కన్నీటి పర్యంతమయ్యారు. చిత్వాన్ జాతీయ ఉద్యానవన అధికారుల వివరాల ప్రకారం ధ్రుబే నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైన అడవి ఏనుగుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగు దాడుల్లో మొత్తం 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. తాజా ఘటనకు ముందు 23 మంది మృతి చెందగా, జగత్‌పూర్‌లో జరిగిన తాజా దాడితో ఆ సంఖ్య 25కు చేరిందని తెలిపారు. ఈ ఏనుగు కదలికలను పర్యవేక్షించేందుకు అటవీ శాఖ 2016 నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టింది. ట్రాకింగ్ కాలర్ అమర్చడం, తరువాత 2020, 2023లో దానిని మార్చడం వంటి చర్యలు తీసుకున్నప్పటికీ, దాని దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయింది. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, మానవ నివాసాలు అటవీ ప్రాంతాలకు విస్తరించడం వల్ల ఇలాంటి మానవవన్యప్రాణుల ఘర్షణలు పెరుగుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన అటవీ సంరక్షణతో పాటు ప్రజల భద్రతకు మరింత సమన్వయంతో కూడిన చర్యలు అవసరమని మరోసారి స్పష్టం చేసింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# వేదికపై భావోద్వేగ క్షణం




అంగీకరించారు. ముఖ్యమంత్రి అనుమతి ఇవ్వడంతో ఆ యువ వైద్యుడు ఆనందంగా ఆయనను కౌగిలించుకుని తన నియామక పత్రాన్ని స్వీకరించాడు. ఈ దృశ్యాన్ని అక్కడ ఉన్నవారు చప్పట్లతో అభినందించగా, కార్యక్రమంలో పాల్గొన్న పలువురు చిత్రీకరించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళనాడు వైద్యారోగ్య శాఖలో కొత్తగా ఎంపికైన మొత్తం 2,144 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరిలో 751 మంది సహాయ వైద్య అధికారులు, 1,393 మంది ఆరోగ్య పరిశీలకులు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి స్వయంగా నియామక పత్రాలు అందించి అభినందించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత జోసెఫ్ విజయ్ ప్రజలకు మరింత చేరువయ్యేలా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో కూడా అభ్యర్థులు, ప్రజలతో ఆప్యాయంగా మెలగడం ఆయన ప్రత్యేకతగా మారింది. గతంలో కూడా ఓ గర్భిణి అభ్యర్థి వేదికపైకి రావడానికి ఇబ్బంది పడుతుండగా, ముఖ్యమంత్రి స్వయంగా వేదిక దిగివెళ్లి ఆమెకు నియామక పత్రం అందించి ప్రశంసలు పొందారు. తాజా ఘటనతో మరోసారి ఆయన మానవీయ కోణం వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ సాదాసీదాగా, ఆప్యాయంగా వ్యవహరించడం పట్ల అభిమానులు, ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ వైద్యుడు ముఖ్యమంత్రిని కౌగిలించుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది.

# శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (14.07.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికిఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమార స్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.



# అగ్గిపెట్టెలోపట్టే పట్టుచీర సమర్పణ

- అమ్మవారికి అరుదైన పట్టుచీర
- సిరిసిల్ల చేనేత కళాకారుడు విజయ్ కుమార్ అద్భుత సృష్టి
- వారంరోజుల పాటు మగ్గంపై నేసిన ప్రత్యేక వస్త్రం

మనగళం శ్రీశైలం : తెలంగాణా రాష్ట్రం సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు కళారత్న నల్ల విజయ్ కుమార్ ఈ రోజు (14.07.2026) అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను అమ్మవారికి సమర్పించారు. ఈ ప్రత్యేక వస్త్రాన్ని ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడుకి అందజేశారు. కార్యక్రమములో ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి కోడె కాంతివర్ధిని కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కళాకారుడు, విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులతో కలసి వారం రోజుల్లో ఈ పట్టుచీరను మగ్గంపై నేసినట్లుగా తెలియజేశారు. మొత్తం 5.5 మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు కలిగిన ఈ పట్టుచీర బరువు 200గ్రాముల దాకా వుంటుశీదన్నారు. సంప్రదాయ "ఇక్కత్" నమూనాలో రూపొందించబడిన ఈ చీరను మడత పెట్టినప్పుడు చిన్న అగ్గిపెట్టెలో సులభంగా ఇమిడిపోతుందన్నారు. శ్రీ అమ్మవారి కృపతోనే ఈ అరుదైన వస్త్రాన్ని రూపొందించడం జరిగిందన్నారు. దేవస్థానం తరపున ఈ ప్రత్యేక పట్టుచీరను స్వీకరించిన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు విజయ్ కుమార్ ప్రతిభను అభినశీధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంప్రదాయమైన పట్టుచీర మన చేనేత కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. మనదేశ సాంస్కృతిక వ్యవస్థలో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. మనదేశంలో చేనేత కేవలం వృత్తిమాత్రమే కాదని అది తరతరాలుగా వస్తున్న ఒక గొప్ప కళ అని అన్నారు. కళాకారుల సృజనాత్మక , నైపుణ్యం మరియు అంకిత భావాలకు చేనేత వస్త్రాలు ప్రతిరూపంగా నిలుస్తాయన్నారు.



అందరుకూడా చేనేత వస్త్రాలను ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా వస్త్ర సమర్పణ చేసిన చేనేత కళాకారులు విజయ్ కుమార్ మరియు వారి బృందానికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేయబడ్డాయి.



# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం మంగళవారము సందర్భంగా ఈ రోజు (14.07.2026) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీర భద్ర స్వామి వారికి విశేష పూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్య రోజులలో బయలువీరభద్ర స్వామి వారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలు వీర భద్ర స్వామి వారు శివ భక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైల క్షేత్ర పాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలు వీర భద్ర స్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖ సంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజా దికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకు మోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# నందీశ్వరస్వామికి విశేషపూజ






మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (14.07.2026) ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేష పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చక స్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకు మోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

## క్యూలైన్లు, విరాళాల కేంద్రాన్ని ఆకస్మికశీగా తనిఖీ చేసిన పోతుగట్టి రమేష్ నాయుడు

మనగళం శ్రీశైలం : ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు ఈ రోజు (14.07.2026) క్యూలైన్లు, విరాళాల కేంద్రాన్ని ఆకస్మికశీగా తనిఖీ చేశారు. ఆయా దర్శనశీ టికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవశీతమైన దర్శనం కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్యూ లైన్లలో ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ దర్శనం క్యూలైన్లను నిర్వహిస్తుండాలన్నారు. అధికారులు పరస్పర సమన్వయముతో విధులు నిర్వర్తించాలన్నారు. భక్తుల రద్దీ సమయంలో ముఖ్యంగా వారాంతపు సెలవులు పర్వదినాలలో క్యూ లైన్ల నిర్వహణ పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు క్యూ లైన్లలో నిరంతరం మంచినీరు, అల్పాహారశీ అందిస్తుండాలని అధికారుకు సూచించారు. దర్శనము వేళలు, దర్శనాలకు పట్టే సమయం మొదలైన అంశాలను నిరంతరం ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ప్రసారం చేస్తుండాలన్నారు. క్యూ లైన్లు, క్యూకాంప్లెక్స్ లో లైట్లు, ఫాన్లు, సజావుగా పనిచేసే విధంగా సంబంధించిన



సిబ్బంది పర్యవేక్షిస్తుండాలన్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ వైరింగులకు ఎప్పటికప్పుడు అవసరమైన తగు మరమత్తులు చేస్తుశీడాలన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు పలువురు భక్తులతో నేరుగా మాట్లాడి దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను గురించి భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా దర్శనము ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, ప్రసాద వితరణ , పారిశుద్ధ్యనిర్వహణ గురించి భక్తులతో సంభాషించారు.

## సర్ ప్రక్రియను త్వరగా చేసుకోండి



మనగళం కల్లూరు బీ సర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సగర కార్పొరేషన్ డైరెక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు కల్లూరు మండలంలోని పర్ల గ్రామ 5 వ బూత్ లో ఆయన పాల్గొని ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఓటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో బీఎల్ఓ ఏజెంట్లు తలారి చిన్న లక్ష్మయ్య, బుక్కల రాజు, బోయ శివ, అయ్యరాజు, వీరాస్వామి, రాజశేఖర్, వెంకటేష్ శ్రీకాంత్, మధు, కోడెల సుదర్శనం, పర్ల టీడీపీ నాయకులు మేకల శేషన్న, కోడెల రవి తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరు అయ్యప్ప స్వామి దేవాలయ సందర్శించిన హంపి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో గలక అద్భుత శిల్పకళ శైలిలో నిర్మితమవుతున్న శ్రీ ధర్మపురి శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయమును మంగళవారం సాయంత్రం 6 గంటలకు హంపి నుంచి విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి వారు సందర్శించారు వీరు హంపీ విరూపాక్ష పీఠానికి (శ్రీ హేమకూట విరూపాక్ష పీఠం) చెందిన ప్రస్తుత పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామివీరు హిందూ ధర్మ పరిరక్షణకు, ఆధ్యాత్మిక ప్రబోధానికి మరియు సనాతన ధర్మ ప్రచారానికి ఎంతో కృషి చేస్తున్నారుపీఠాధిపతి చరిత్ర, విశేషాలు:ఆధ్యాత్మిక సేవ: వీరు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజలలో సేవాభావాన్ని, ధర్మ జాగృతిని పెంపొందిస్తున్నారుహిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని, పంచభూతాల ప్రాముఖ్యతను మరియు దేవాలయాల ఆవశ్యకతను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ప్రవచనాల ద్వారా తెలియజేస్తున్నారుధార్మిక కార్యక్రమాలు: నూతన దేవాలయాల నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలు, యంత్ర స్థాపనలు మరియు ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలను వీరు స్వయంగా నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్నారుసామాజిక సందేశం: ప్రపంచ శాంతికి మరియు మానవ సంక్షేమానికి హిందూ ధర్మమే మూలమని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని స్వామీజీ ప్రబోధిస్తుంటారు

## బడ్జెట్‌లోనే నిత్యావసరాల కొనుగోలు..

హైదరాబాద్, మన గళం : నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ ఖర్చులను నియంత్రించడం సామాన్యులకు సవాలుగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ అవసరాలను తీర్చుకునేందుకు పలువురు రిటైల్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. సరైన ప్రణాళికతో కొనుగోలు చేస్తే పరిమిత బడ్జెట్‌లోనే చిన్న కుటుంబానికి అవసరమైన నిత్యావసర వస్తువులను సమకూర్చుకోవచ్చని వినియోగదారుల నిపుణులు సూచిస్తున్నారు.

షాపింగ్‌కు వెళ్లే ముందు బియ్యం, పప్పులు, వంటనూనె, ఉప్పు, చక్కెర వంటి అత్యవసర వస్తువులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. అనంతరం టీ పొడి, మసాలా దినుసులు, స్నాన సబ్బులు, బట్టలు ఉతికే పొడి వంటి రోజువారీ అవసరాల వస్తువులను జాబితాలో చేర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో అవసరం లేని వస్తువులను కొనుగోలు చేయకుండా, నిజంగా అవసరమైన వాటినే ఎంచుకోవడం ద్వారా గణనీయమైన ఆదా సాధించవచ్చని పేర్కొంటున్నారు.

# యువశక్తికి నైపుణ్యాలే బలం

మన గళం డెస్క్ : ప్రపంచ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైనది. దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువత చేతుల్లోనే ఉంటుంది. అయితే కేవలం విద్యార్హతలు మాత్రమే ఉంటే సరిపోదు. మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన వంటి లక్షణాలు కూడా అవసరం. ఈ విషయంపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై 15న ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఈ దినోత్సవాన్ని ప్రకటించగా, 2015 నుంచి ప్రపంచ దేశాలు అధికారికంగా పాటిస్తున్నాయి. యువతకు నాణ్యమైన నైపుణ్యాలను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో గత పదేళ్లలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, యాంత్రీకరణ, స్వయంచాలక వ్యవస్థలు, డిజిటల్ సేవలు వేగంగా విస్తరించడంతో ఉద్యోగాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు డిగ్రీ ఉంటే ఉద్యోగం దొరికే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు మాత్రం సంస్థలు అభ్యర్థుల్లో ప్రాయోగిక నైపుణ్యాలు, కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యం, కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలను ఎక్కువగా పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో యువత తమను తాము నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యవసరంగా మారింది. భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. దేశ జనాభాలో అధిక శాతం మంది యువకులే ఉండటం భారత్‌కు గొప్ప అవకాశంగా భావిస్తున్నారు. ఈ యువశక్తిని సరైన దిశలో మలిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. నైపుణ్యాలు లేని యువత నిరుద్యోగులుగా మిగిలిపోతే అది దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారుతుంది. అందుకే విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రతి ప్రభుత్వానికి ముఖ్యమైన బాధ్యతగా మారింది. ప్రస్తుతం పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలు గతంతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ సేవలు, యంత్రాల నిర్వహణ, ఆరోగ్య సేవలు, నిర్మాణ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పర్యాటకం, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, వస్త్ర పరిశ్రమ, ఆహార శుద్ధి వంటి అనేక రంగాల్లో శిక్షణ పొందిన యువతకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి కూడా నైపుణ్యాలే ప్రధాన ఆధారం అవుతున్నాయి. విద్యాసంస్థలు కూడా కాలానుగుణంగా తమ బోధనా విధానాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశ్రమలకు అనుసంధానమైన శిక్షణ, ప్రత్యక్ష అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్య పూర్తయ్యే సమయానికే ప్రతి విద్యార్థి ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా నైపుణ్యాలను పెంపొందించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేస్తే యువతకు మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యువత నైపుణ్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం,



స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం అందించడం వంటి చర్యలు చేపడుతున్నాయి. మహిళలు, గ్రామీణ యువత, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. నేటి ప్రపంచంలో ఒక ఉద్యోగంతోనే జీవితాంతం కొనసాగడం కష్టంగా మారుతోంది. కొత్త సాంకేతికతలు రావడంతో ప్రతి కొన్నేళ్లకోసారి కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే జీవితాంతం నేర్చుకునే సంస్కృతి ప్రతి యువకుడిలో పెరగాలి. కొత్త కోర్సులు, శిక్షణా కార్యక్రమాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకోవడం ద్వారా మాత్రమే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం సాధ్యమవుతుంది. నైపుణ్యాలు ఉద్యోగాలకే పరిమితం కావు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగడానికి కూడా అవి ఎంతో ఉపయోగపడతాయి. సమయపాలన, నాయకత్వం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించే నైపుణ్యం, ఆర్థిక నిర్వహణ, సంభాషణ తీరు వంటి జీవన నైపుణ్యాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. ఇవి కుటుంబ జీవితం నుంచి వృత్తి జీవితానికి వరకు ప్రతి దశలో విజయాన్ని అందిస్తాయి. ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి యువకుడికి ఒక ప్రేరణగా నిలవాలి. విద్య పూర్తయిన తర్వాత మాత్రమే నైపుణ్యాలను నేర్చుకోవాలనే భావనకు స్వస్తి పలకాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక అవగాహన, వృత్తి నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. కుటుంబాలు కూడా పిల్లల ఆసక్తులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ అందించడంలో ముందుండాలి. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉంది. ఆ యువశక్తికి విద్యతో పాటు నైపుణ్యాలు తోడైతేనే అభివృద్ధి వేగవంతమవుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పరిశ్రమలు బలోపేతం అవుతాయి. స్వయం ఉపాధి విస్తరిస్తుంది. ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్ఠంగా మారుతుంది. ప్రపంచ స్థాయిలో పోటీ పడే సామర్థ్యం భారత యువతకు ఇప్పటికే ఉంది. ఆ సామర్థ్యానికి సరైన నైపుణ్యాలను జోడించడం ద్వారా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.

# సంపాదకీయం

## గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఎందుకు అవసరం?

మన గళం డెస్క్ : భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా గుర్తింపు పొందింది. ఈ యువశక్తిలో ఎక్కువ శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే గ్రామాల్లో అపారమైన ప్రతిభ, కష్టపడే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన ఉన్న యువత కొదవలేదు. కానీ వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సరైన మార్గదర్శకత్వం అందకపోవడంతో వారి సామర్థ్యం పూర్తిస్థాయిలో వెలుగులోకి రావడం లేదు. గ్రామీణ యువతను అభివృద్ధి పథంలో నడిపించాలంటే విద్యతో పాటు నైపుణ్య శిక్షణను తప్పనిసరిగా అందించాల్సిన అవసరం ఏర్పడింది. ఇదే దేశ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుంది. నేటి పరిస్థితుల్లో డిగ్రీ లేదా ఉన్నత విద్య ఒక్కటే ఉపాధికి హామీ ఇవ్వడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోంది. పరిశ్రమలు, సేవారంగం, వ్యవసాయం, సమాచార సాంకేతిక రంగం, ఆరోగ్య సేవలు, నిర్మాణ రంగం వంటి ప్రతి విభాగంలోనూ ప్రాయోగిక నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఉద్యోగం ఇవ్వాలంటే అభ్యర్థికి పని చేయగల సామర్థ్యం ఉందా లేదా అనే విషయాన్నే సంస్థలు ఎక్కువగా పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ యువత కూడా ప్రపంచ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది. గ్రామాల్లో విద్య పూర్తయిన తర్వాత చాలా మంది యువత ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళుతున్నారు. అక్కడ కూడా తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చిన్న చిన్న పనులకే పరిమితమవుతున్నారు. కొందరు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. దీంతో కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. గ్రామాల్లోనే నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందుబాటులో ఉంటే స్థానికంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చు. వలసలు తగ్గడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది. వ్యవసాయం ఇప్పటికీ గ్రామీణ జీవనానికి ప్రధాన ఆధారం. అయితే సంప్రదాయ పద్ధతులతో మాత్రమే వ్యవసాయం కొనసాగించడం వల్ల ఆశించిన ఆదాయం రావడం లేదు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రిప్ సేద్యం, సేంద్రియ సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ యంత్రాల వినియోగం, మార్కెటింగ్ వంటి అంశాల్లో యువతకు శిక్షణ అందిస్తే వ్యవసాయాన్నే లాభదాయక రంగంగా మార్చే అవకాశం ఉంటుంది. రైతు కుటుంబాలకు చెందిన యువత వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంతో ముందుకు తీసుకెళ్లగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. నైపుణ్య శిక్షణ అంటే కేవలం యంత్రాలను నడపడం లేదా ఒక వృత్తిని నేర్చుకోవడం మాత్రమే కాదు. సమయపాలన, కమ్యూనికేషన్, నాయకత్వం, ఆర్థిక నిర్వహణ, సమస్యల పరిష్కార సామర్థ్యం, డిజిటల్ పరిజ్ఞానం, బృందంగా పనిచేసే నైపుణ్యం వంటి జీవన నైపుణ్యాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఇవి ఉద్యోగాల్లో మాత్రమే కాకుండా స్వయం ఉపాధి, వ్యాపార నిర్వహణ, సామాజిక జీవితంలో కూడా విజయానికి దోహదపడతాయి. వ్యక్తిత్వ వికాసానికి ఈ నైపుణ్యాలు ఎంతో అవసరం.ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధ, డిజిటల్ సేవలు, యాంత్రీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మార్పులకు అనుగుణంగా గ్రామీణ యువతను సిద్ధం చేయకపోతే పట్టణ యువతతో పోటీ పడడం కష్టమవుతుంది. కంప్యూటర్ పరిజ్ఞానం, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, సమాచార సాంకేతిక వినియోగం వంటి అంశాల్లో శిక్షణ అందించడం ద్వారా గ్రామీణ యువతకు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా అవకాశాలు లభించే అవకాశం ఉంది. గ్రామం నుంచి ప్రపంచానికి సేవలు అందించే స్థాయికి యువత ఎదగగలుగుతుంది. స్వయం ఉపాధి రంగంలో కూడా నైపుణ్యాల పాత్ర అత్యంత కీలకం. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, ఆహార పదార్థాల తయారీ, మరమ్మతు కేంద్రాలు, డిజిటల్ సేవా కేంద్రాలు, చేతివృత్తులు వంటి రంగాల్లో యువత సొంత వ్యాపారాలు ప్రారంభించవచ్చు. ఒక వ్యక్తి స్వయం ఉపాధి పొందితే అతనితో పాటు మరికొందరికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. దీనివల్ల గ్రామాల్లో ఆదాయం పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ చైతన్యవంతమవుతుంది.గ్రామీణ మహిళలకు కూడా నైపుణ్య శిక్షణ ఎంతో అవసరం. మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తే కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆహార ఉత్పత్తులు, దుస్తుల తయారీ, హస్తకళలు, డిజిటల్ సేవలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, గ్రామం, సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా అమలు కావాలి. ప్రతి మండలంలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో అనుసంధానం కల్పించడం, శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు లేదా స్వయం ఉపాధికి అవసరమైన రుణాలు, మార్గదర్శకత్వం అందించడం వంటి చర్యలు తీసుకోవాలి. పాఠశాలలు, కళాశాలలు, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే గ్రామీణ యువతలో నైపుణ్యాల విప్లవం తీసుకురావచ్చు. గ్రామీణ యువతలో అపారమైన ప్రతిభ ఉంది. ఆ ప్రతిభకు సరైన నైపుణ్యాలను జోడిస్తే గ్రామాలు ఆర్థికంగా బలపడతాయి. నిరుద్యోగం తగ్గుతుంది. వలసలు తగ్గుతాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. దేశ పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు గ్రామాల నుంచే లభిస్తాయి. అభివృద్ధి నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామాలకు కూడా చేరుతుంది. యువత చేతుల్లో నైపుణ్యాలు ఉంటే వారి జీవితాలు మాత్రమే కాదు, గ్రామాల భవిష్యత్తు కూడా మారుతుంది. గ్రామాలు బలపడితేనే దేశం బలపడుతుంది. అందుకే గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణను ఒక సంక్షేమ కార్యక్రమంగా కాకుండా దేశ నిర్మాణానికి అత్యంత కీలకమైన పెట్టుబడిగా ప్రతి ప్రభుత్వం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి కుటుంబం భావించాల్సిన సమయం ఆసన్నమైంది.



# కోవిడ్ టీకాపై స్పష్టత



(ఐసీఎంఆర్) తాజా అధ్యయనం పూర్తి స్పష్టత ఇచ్చింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరిశోధనలో కోవిడ్ టీకాలకు గుండెపోటు లేదా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్యలతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని తేల్చింది. ముఖ్యంగా 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల వారిలో ఈ ప్రమాదాలు టీకాల వల్ల పెరగలేదని అధ్యయనం వెల్లడించింది. భారత వైద్య పరిశోధనా మండలి, జాతీయ అంటువ్యాధుల పరిశోధన సంస్థ సంయుక్తంగా దేశంలోని సుమారు 25 ఆస్పత్రుల్లో ఈ పరిశోధన చేపట్టాయి. 2021 నుంచి 2023 మధ్య నమోదైన గుండెపోటు, రక్తం గడ్డకట్టే ఘటనలను విశ్లేషిస్తూ ఈ అధ్యయనం నిర్వహించారు. టీకా తీసుకున్న వ్యక్తుల ఆరోగ్య వివరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నివేదికను విడుదల చేశారు.

పరిశోధనలో భాగంగా 432 గుండెపోటు కేసులు, 767 రక్తం గడ్డకట్టే కేసులను విశ్లేషించారు. ఒకటి లేదా రెండు డోసుల కోవిడ్ టీకా తీసుకున్న వారిలో గుండెపోటు లేదా రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడే ప్రమాదం పెరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. టీకాలపై ప్రచారంలో ఉన్న అనుమానాలకు శాస్త్రీయ ఆధారాలు లేవని నివేదిక పేర్కొంది. అయితే రక్తం గడ్డకట్టే సమస్యలకు ఇతర కారణాలు ప్రధానంగా ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. ధూమపానం, గతంలో ఉన్న ఆరోగ్య సమస్యలు, కుటుంబంలో హృద్రోగాలు లేదా రక్త సంబంధిత వ్యాధుల చరిత్ర, జీవనశైలి వంటి అంశాలు ఈ సమస్యలకు కారణమవుతున్నాయని గుర్తించారు. కాబట్టి ఈ పరిస్థితులను కోవిడ్ టీకాలతో ముడిపెట్టడం సరైనది కాదని పరిశోధకులు సూచించారు.

భారత్‌లో కోవిడ్ టీకాల కార్యక్రమం ప్రజారోగ్య పరంగా మంచి ఫలితాలను ఇచ్చిందని అధ్యయనం పేర్కొంది. 2023 మే నాటికి అర్హులైన వారిలో సుమారు 97 శాతం మందికి కనీసం ఒక డోసు, దాదాపు 90 శాతం మందికి రెండు డోసులు అందించినట్లు తెలిపింది. ఆరోగ్య సిబ్బంది, వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అదనపు డోసులు కూడా అందించినట్లు వివరించింది. కోవిడ్ టీకాల వల్ల వ్యాధి తీవ్రత తగ్గడంతో పాటు ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య, మరణాల ప్రమాదం కూడా తగ్గినట్లు అధ్యయనం స్పష్టం చేసింది. దీర్ఘకాలిక కోవిడ్ సమస్యలను తగ్గించడంలో కూడా టీకాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొంది. ఈ అధ్యయనం ఐసీఎంఆర్‌జాతీయ అంటువ్యాధుల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ మురేకర్ నేతృత్వంలో నిర్వహించగా, కోవిడ్ టీకాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించే కీలక ఆధారంగా ఈ నివేదిక నిలుస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కోడుమూరు పట్టణంలోని ఒకటో వార్డులో నీటి సమస్యలను పరిష్కరించాలి సిపిఎం



మన గళం కోడుమూరు: కోడుమూరు గ్రామంలోని ఒకటో వార్డు ప్రజలు 15 రోజులకు ఒకసారి కుళాయిలకు నీళ్లు వదులుతారు ఆ నీళ్లు రాత్రి మూడు గంటలకు వదిలితే తెల్లారితే 11 గంటలైనా నాలుగు బిందెలు మాత్రమే వస్తాయని ఒకటో వార్డు ప్రజలు ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగి అర్జీలు పెట్టిన ఫలితం లేకపోవడంతో ఈ సమస్యను సిపిఎం పార్టీ నాయకులు జిపి వీరన్న దృష్టికి తీసుకురావడంతో ఆ వీధి ప్రజలతో కోడుమూరు గ్రామపంచాయతీకి చేరుకుని ఈవో జమీలాభి మేడం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను. సిపిఎం పార్టీ నాయకులు వివరిస్తూ నాలుగు నెలల ముందు అధికారులు ఆ వీధిని సందర్శించి మీకు కొత్తగ పైపులైను వేస్తాము. వాలులు వేస్తాము.అప్పుడు మీకు నీటి సమస్య తీరుతుంది అని అధికారులు చెప్పడమైనది ప్రోక్లీన్లతో గుంతలు తవ్వేసి వదిలివేశారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ వీధిలో నెలకొన్న నీటి సమస్య కోసం పైపులైను వాలులు ఏర్పాటు చేసి ఆ వీధి ప్రజలకు మూడు నాలుగు రోజులకు నీళ్లు వదినేలాగా చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ అధికారులకు కోరుతూ అర్జీ ఇవ్వడమైనది కార్యక్రమంలో జీమాధవస్వామి. ఎస్ కృష్ణ. సిద్ధేషు. కుమార్. పరమేష్. ఎల్లమ్మ. మా బి. రజియా. సుశీల. భారతి.

## కళాంజలి నృత్యనికేతన్ డాన్సు అకాడమీ, పశ్చిమగోదావరి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన







మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (14.07.2026) కళాంజలి నృత్యనికేతన్ డాన్సు అకాడమీ, పశ్చిమగోదావరి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో గణపతి కౌత్వం, జయ గణనాయక, మూషికవాహన, విఘ్నరాజంభజే, లింగాష్టకం, భో..శంభో, నమశ్శివాయతే, అయిగిరినందిని, శివలీలలు తదితర గీతాలకు ఆరాధ్య, లోహిత, హన్విక, హరిణి, సంహిత, ప్రజ్ఞాలహరి, రేణుక, తన్వి, లక్ష్మీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మ వార్లకు




ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## క్రెడిట్ కార్డులకు తగ్గుతున్న ఆదరణ..




మన గళం, న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డుల వినియోగానికి క్రమంగా ఆదరణ తగ్గుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రముఖ క్రెడిట్ బ్యూరో ట్రాన్స్‌యూనియన్ సిబిల్ నివేదిక ప్రకారం, యూపీఐ చెల్లింపులు, తక్షణ వ్యక్తిగత రుణాల వినియోగం పెరగడంతో సంప్రదాయ క్రెడిట్ కార్డుల డిమాండ్‌పై ప్రభావం పడుతోంది. సులభమైన లావాదేవీలు, వేగవంతమైన సేవలు అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది వినియోగదారులు యూపీఐ ఆధారిత చెల్లింపుల వైపు మొగ్గు చూపుతున్నారని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 5.2 కోట్ల మంది మాత్రమే క్రెడిట్ కార్డులను వినియోగిస్తున్నారని, రుణ సదుపాయాలకు అర్హులైన జనాభాలో ఇది కేవలం 25 శాతం మాత్రమేనని వెల్లడించింది. కొలంబియా, హాంకాంగ్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే భారత్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం ఇంకా తక్కువ స్థాయిలోనే ఉందని పేర్కొంది. అలాగే కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకుంటున్న వారిలో తొలిసారి రుణం పొందుతున్న వారి శాతం గత ఏడాది 26 శాతం ఉండగా, ప్రస్తుతం అది 8 శాతానికి పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది.రోజువారీ కొనుగోళ్ల కోసం క్రెడిట్ కార్డుల కంటే యూపీఐ చెల్లింపులనే ఎక్కువ మంది వినియోగదారులు ఎంచుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి క్షణాల్లో చెల్లింపులు పూర్తి చేయగలగడం, అవసరమైనప్పుడు తక్షణ వ్యక్తిగత రుణాలు కూడా సులభంగా పొందే అవకాశం ఉండటంతో యూపీఐ సేవల వినియోగం వేగంగా పెరుగుతోంది. రూపే క్రెడిట్ కార్డులను కూడా యూపీఐతో అనుసంధానం చేసుకునే అవకాశం ఉండటం వినియోగదారులకు మరింత సౌలభ్యాన్ని కల్పిస్తోంది.వ్యాపారులు చెల్లించాల్సిన మెర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు కూడా క్రెడిట్ కార్డుల వినియోగం తగ్గడానికి మరో కారణంగా నిపుణులు చెబుతున్నారు. చిన్న వ్యాపారులు ఈ అదనపు వ్యయాన్ని తప్పించుకునేందుకు ఉచితంగా అందుబాటులో ఉన్న యూపీఐ క్యూఆర్ కోడ్‌లను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. యూపీఐ యాప్‌లలో క్రెడిట్ కార్డుల వినియోగానికి కొన్ని పరిమితులు ఉండటం కూడా కార్డుల వినియోగంపై ప్రభావం చూపుతోంది.ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ క్రెడిట్ కార్డుల కంటే మొబైల్ ఆధారిత డిజిటల్ చెల్లింపులు, యూపీఐ సేవలు, డిజిటల్ క్రెడిట్ సదుపాయాల వినియోగమే మరింత పెరిగే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ కీలక పాత్ర పోషిస్తూ ఆర్థిక లావాదేవీలను మరింత సులభతరం చేస్తోందని వారు పేర్కొంటున్నారు.

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త..




మన గళం, న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన ఖాతాదారులకు మరో శుభవార్త అందించింది. ప్రధాన డేటాబేస్ ఏకీకరణ, సాఫ్ట్‌వేర్ నవీకరణ పనుల కారణంగా గత రెండు వారాలుగా పరిమితంగా అందుబాటులో ఉన్న సేవలు ఇప్పుడు పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడుతున్నాయి. ఈ సందర్భంగా పీఎఫ్ ఖాతా బదిలీ విధానాన్ని మరింత సులభతరం చేస్తూ సంస్థ కొత్త మార్పులను అమలు చేసింది.ఉద్యోగులు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారినప్పుడు పీఎఫ్ ఖాతాలోని నిధులను బదిలీ చేసుకునే ప్రక్రియను సులభతరం చేయడానికి ఇకపై రెండు మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఒకే విధానం ఉండగా, ఇప్పుడు మరో ప్రత్యామ్నాయాన్ని కూడా కల్పించింది. దీనివల్ల కాగితపు ప్రక్రియ తగ్గడంతో పాటు బదిలీ ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.మొదటి విధానంలో ఉద్యోగులు పీఎఫ్ పోర్టల్‌లో తమ యూఏఎన్ సంఖ్య, సంకేత పదంతో ప్రవేశించి, మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేయాలి. అనంతరం ఆన్‌లైన్ సేవల విభాగంలోకి వెళ్లి బదిలీ అభ్యర్థన ఎంపికను ఎంచుకోవాలి. అక్కడ గత సంస్థ సభ్యత్వ సంఖ్యను ఎంపిక చేసి వివరాలను పొందాలి. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేసిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థ వివరాలు కనిపిస్తాయి. వాటిని ఒకసారి పరిశీలించి అభ్యర్థనను సమర్పిస్తే బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతుంది.రెండో విధానంలో పీఎఫ్ పోర్టల్‌లోకి ప్రవేశించిన తర్వాత సభ్య సేవల చరిత్ర విభాగాన్ని ఎంచుకోవాలి. అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థతో పాటు గతంలో పనిచేసిన సంస్థల వివరాలు కనిపిస్తాయి. సంబంధిత ఎంపిక వద్ద ఉన్న అభ్యర్థన లింక్‌ను ఎంచుకుని ఫారం13ను సమర్పించడం ద్వారా కూడా పీఎఫ్ నిధులను కొత్త సంస్థ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు.ఈ మార్పులతో ఉద్యోగులు ఉద్యోగం మారిన ప్రతిసారి పీఎఫ్ నిధుల బదిలీని మరింత వేగంగా, సులభంగా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తెలిపింది.

## ఈ వారం నాలుగు రోజులు బ్యాంకులకు సెలవులు..




మన గళం, ముంబై : బ్యాంకు శాఖల్లో చేయాల్సిన పనులు ఉన్న ఖాతాదారులు ఈ వారం సెలవుల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జూలై 13 నుంచి 19 వరకు వివిధ జాతీయ, ప్రాంతీయ, మతపరమైన పండుగలు, వారాంతపు సెలవుల కారణంగా నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించిన వార్షిక సెలవుల జాబితా ప్రకారం జూలై నెలలో మొత్తం 12 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి.జూలై 16న రథయాత్ర, కాంగ్ పండుగ, హరేలా ఉత్సవాల సందర్భంగా భువనేశ్వర్, డెహ్రాడూన్, ఇంఫాల్ నగరాల్లో బ్యాంకులు పనిచేయవు. జూలై 17న యు. తిరోత్ సింగ్ వర్ధంతి సందర్భంగా షిల్లాంగ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూలై 18న ద్రుక్పా త్షే-జి పండుగ సందర్భంగా గ్యాంగ్‌టక్‌లో బ్యాంకులు మూసివేస్తారు. జూలై 19న ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు సెలవు పాటించనున్నాయి.భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి నెల రెండో, నాలుగో శనివారాలతో పాటు ప్రతి ఆదివారం అన్ని షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు తప్పనిసరిగా మూసివేయబడతాయి. ఈ రోజుల్లో శాఖల ద్వారా ప్రత్యక్ష సేవలు అందుబాటులో ఉండవు. జూలై నెలలో 5, 12, 19, 26 తేదీలలో ఆదివారం సెలవులు ఉండగా, 11న రెండో శనివారం, 25న నాలుగో శనివారం కారణంగా కూడా బ్యాంకులు మూసి ఉంటాయి.అయితే బ్యాంకు సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. ఖాతాదారులు మొబైల్ బ్యాంకింగ్, అంతర్జాల బ్యాంకింగ్, యూపీఐ, నగదు బదిలీ వంటి సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగించుకోవచ్చు. చెక్కుల జమ, రుణ దరఖాస్తులు, నగదు లావాదేవీలు వంటి శాఖల ద్వారా జరిగే సేవలు మాత్రమే అందుబాటులో ఉండవు. అందువల్ల అత్యవసర బ్యాంకింగ్ పనులు ఉన్నవారు ముందుగానే ప్రణాళిక చేసుకుని పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కారు ప్రయాణంలో పుట్టిన అమెజాన్..




మన గళం, సియాటెల్ : ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-వాణిజ్య సంస్థల్లో ఒకటిగా ఎదిగిన అమెజాన్ ప్రయాణం సాధారణ కారు ప్రయాణంలో మొదలైంది. 1994లో వాల్ స్ట్రీట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక ఉద్యోగానికి రాజీనామా చేసిన జెఫ్ బెజోస్, తన భార్య మెకెంజీ స్కాట్‌తో కలిసి టెక్సాస్ నుంచి సియాటెల్‌కు కారులో బయలుదేరారు. ఆ సుదీర్ఘ ప్రయాణంలో మెకెంజీ కారు నడుపుతుండగా, పక్క సీటులో కూర్చున్న బెజోస్ తన ల్యాప్‌టాప్‌లో అమెజాన్‌కు సంబంధించిన 30 పేజీల వ్యాపార ప్రణాళికను రూపొందించారు. అదే ప్రయాణం ప్రపంచ వ్యాపార చరిత్రలో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలికింది.ఆ సమయంలో డి.ఈ. షా అండ్ కంపెనీలో అత్యంత పిన్న వయస్కుడైన సీనియర్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న బెజోస్ భారీ వేతనం అందుకుంటున్నారు. అయినప్పటికీ అంతర్జాల భవిష్యత్తుపై ఉన్న విశ్వాసంతో ఆ ఉద్యోగాన్ని వదిలి సొంత వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆన్‌లైన్‌లో పుస్తకాల విక్రయం చేయాలన్న తన ఆలోచనను భార్య మెకెంజీతో పంచుకోగా, ఆమె కూడా పూర్తి మద్దతు ఇచ్చి ఆ ప్రయాణంలో భాగస్వామిగా నిలిచారు.సియాటెల్ సమీపంలోని బెల్లెవ్యూ చేరుకున్న అనంతరం బెజోస్ తన ఇంటి గ్యారేజ్‌లో సంస్థను ప్రారంభించారు. తొలుత సంస్థకు 'కాడాబ్రా' అనే పేరు పెట్టినా, అనంతరం దక్షిణ అమెరికాలోని అమెజాన్ నది పేరును సంస్థకు నామకరణం చేశారు. 1995 జులైలో పుస్తకాల విక్రయంతో ప్రారంభమైన అమెజాన్ వెబ్‌సైట్, ఆ తర్వాత సంగీతం, విద్యుత్ పరికరాలు, ఇతర వినియోగ వస్తువుల విక్రయాలకు విస్తరించింది. 1997లో నాస్‌డాక్ స్టాక్ మార్కెట్‌లో నమోదైన తర్వాత సంస్థ వేగంగా అభివృద్ధి చెంది ప్రపంచ ఈ-వాణిజ్య రంగంలో అగ్రగామిగా నిలిచింది.అమెజాన్ ప్రారంభ దశలో మెకెంజీ స్కాట్ కీలక పాత్ర పోషించారు. సంస్థ ఖాతాల నిర్వహణ, ఉద్యోగులకు వేతన చెల్లింపులు, లెక్కల పర్యవేక్షణ, ఉద్యోగుల నియామకాలు, రవాణా ఒప్పందాల నిర్వహణ వంటి బాధ్యతలను ఆమె స్వయంగా నిర్వహించారు. అనంతరం అమెజాన్ మేఘ గణన సేవలు, సరుకు పంపిణీ వ్యవస్థ, ప్రసార వేదికలు, కృత్రిమ మేధస్సు వంటి అనేక రంగాల్లో విస్తరించి ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. 2021లో ప్రధాన కార్యనిర్వాహక అధికారి పదవి నుంచి తప్పుకున్న జెఫ్ బెజోస్ ప్రస్తుతం సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# తగ్గిన బంగారం ధరలు..



మన గళం, హైదరాబాద్ : బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. సోమవారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే పసిడి ధరలు గణనీయంగా తగ్గడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. తాజా ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా నమోదైంది. గత ధరతో పోలిస్తే రూ.1,420 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,30,000కు చేరుకుంది. ఈ విభాగంలో కూడా రూ.1,300 మేర తగ్గుదల నమోదైంది.18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర హైదరాబాద్, విజయవాడతో పాటు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో రూ.1,07,180గా కొనసాగుతోంది.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసం కనిపించింది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,000గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,000గా నమోదైంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,060, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,150గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళ ప్రాంతాల్లో హైదరాబాద్‌తో సమానంగా ధరలు నమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,42,960, 22 క్యారెట్ల బంగారం రూ.1,30,050గా ఉంది.అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, భౌగోళిక పరిణామాల ప్రభావంతో బంగారం ధరల్లో రోజువారీ మార్పులు చోటు చేసుకుంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసేముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.

# నాలుగు రోజుల్లో రూ. 67 కోట్ల మార్కు దాటిన 'లెనిన్'

మన గళం, సినిమా , హైదరాబాద్ : అక్కినేని అఖిల్ కథానాయకుడిగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకున్న ఈ మాస్ యాక్షన్ చిత్రం వరుసగా భారీ వసూళ్లు నమోదు చేస్తూ అఖిల్ సినీ జీవితంలోనే అత్యంత విజయవంతమైన చిత్రంగా నిలిచే దిశగా దూసుకెళ్తోంది. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో అఖిల్ నటన, భాగ్యశ్రీ బోర్సే అభినయం, థమన్ అందించిన సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాలు, భావోద్వేగ సన్నివేశాలు, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. విడుదలైన తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 16.7 కోట్ల స్థూల వసూళ్లు సాధించిన ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రారంభాన్ని నమోదు చేసింది. అనంతరం రెండో, మూడో రోజుల్లో కూడా అదే జోరు కొనసాగిస్తూ తొలి వారాంతం ముగిసే నాటికి రూ. 61.1 కోట్ల స్థూల వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ వసూళ్లతో పంపిణీదారుల పెట్టుబడులు వేగంగా తిరిగి వస్తున్నాయని సినీ వాణిజ్య వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా మాస్ కేంద్రాలతో పాటు కుటుంబ ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తుండటం సినిమాకు కలిసొస్తోంది. అయితే వారాంతం ముగిసిన తర్వాత వచ్చిన సోమవారం కలెక్షన్లలో సహజంగానే తగ్గుదల కనిపించింది. సాధారణంగా వారాంతం తర్వాత చాలా సినిమాలకు వసూళ్లు తగ్గినట్లే 'లెనిన్' కూడా కొంత మందగించింది. అయినప్పటికీ ముందస్తు బుకింగ్‌లు, ప్రేక్షకుల స్పందన కారణంగా నాలుగో రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా రూ. 6.1 కోట్ల స్థూల వసూళ్లు నమోదు చేసింది. దీంతో నాలుగు రోజుల ముగింపుకు 'లెనిన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ. 67.2 కోట్ల స్థూల వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్‌లో కేవలం నాలుగు రోజుల్లోనే ఈ మైలురాయిని చేరుకున్నందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. బ్లాక్‌బస్టర్ ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది.




# రాకాలో మరో హీరోయిన్.. మరింత పెరిగిన ఆసక్తి




మన గళం, సినిమా , హైదరాబాద్ : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై సినీ అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. విజ్ఞాన కల్పన, భారీ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి చిన్న సమాచారం కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మరింత ఆసక్తి నెలకొంది. సినిమాలో ఒకరికి మించి పలువురు కథానాయికలు నటించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా కొనసాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు ప్రముఖ నటీమణుల పేర్లు కూడా వినిపించాయి. ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు అధికారికంగా బయటకు వచ్చింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా 'రాకా'లో నటిస్తున్నట్లు ప్రకటించడంతో చిత్రంపై ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నైలా గ్రేవల్ మాట్లాడుతూ, దర్శకుడు అట్లీతో కలిసి పని చేయాలనే కోరిక చాలా కాలంగా ఉందని తెలిపింది. ఇప్పుడు ఆ అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది. ఇంత పెద్ద స్థాయి చిత్రంలో భాగం కావడం తన సినీ జీవితంలో ప్రత్యేక మైలురాయిగా భావిస్తున్నానని చెప్పింది. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే భారీ చిత్రంలో అవకాశం దక్కడం గౌరవంగా భావిస్తున్నానని ఆమె వెల్లడించింది. నైలా గ్రేవల్ ఇప్పటికే పలు హిందీ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. విభిన్న పాత్రల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న ఆమె ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది. ఈ భారీ చిత్రంలో ఆమె పాత్రకు కథలో మంచి ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతుండటంతో కథ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దర్శకుడు అట్లీ తనదైన శైలిలో భావోద్వేగాలు, యాక్షన్, విజ్ఞాన కల్పన అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ప్రతి పాత్రకూ ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా కథను రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ వేగంగా కొనసాగుతుండగా, మిగిలిన నటీనటులు, పాత్రలు, కథకు సంబంధించిన వివరాలను దశలవారీగా వెల్లడించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. అల్లు అర్జున్ సినీ జీవితంలోనే అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే దేశవ్యాప్తంగా విశేషమైన అంచనాలను సొంతం చేసుకుంది. కొత్త నటీనటుల చేరికతో 'రాకా'పై ఆసక్తి మరింత పెరిగిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నాగచైతన్య కొత్త సినిమాలపై స్పష్టత

మన గళం, సినిమా , హైదరాబాద్ : అక్కినేని నాగచైతన్య తదుపరి చిత్రాలపై గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతున్న వార్తలకు తాజాగా ఆయన సన్నిహిత వర్గాలు స్పష్టత ఇచ్చాయి. ఇద్దరు యువ దర్శకులతో నాగచైతన్య కొత్త సినిమాలకు అంగీకారం తెలిపారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని వెల్లడించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన పూర్తిగా 'వృషకర్మ' సినిమా చిత్రీకరణపైనే దృష్టి కేంద్రీకరించారని, కొత్త ప్రాజెక్టులపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. ఇటీవల 'మసూద' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథకు నాగచైతన్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఈ చిత్రం రూపొందనుందని, ఇది భయానక ఉత్కంఠభరిత కథతో తెరకెక్కనున్నట్లు పలు కథనాలు వెలువడ్డాయి. కథ నచ్చడంతో తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను నాగచైతన్య వర్గాలు ఖండించినట్లు సమాచారం. ఇప్పటివరకు దర్శకుడు సాయి కిరణ్‌తో కథా చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో దర్శకుడు క్లాక్స్‌తో కూడా నాగచైతన్య సినిమా చేయబోతున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. 'వృషకర్మ' చిత్రీకరణ పూర్తైన వెంటనే ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లనున్నారని, ఈ ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశముందని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట వాస్తవమే అయినప్పటికీ, ఇప్పటివరకు ఏ కథకూ నాగచైతన్య తుది ఆమోదం తెలపలేదని సమాచారం. ఇటీవల వరుసగా విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటున్న ఆయన, తదుపరి సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, పాత్ర, దర్శకుడి దృష్టికోణం వంటి అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.




# 'తుంబాడ్ 2'లో చేరిన ఆలియా భట్



మన గళం, సినిమా , ముంబై : భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రత్యేకమైన భయానక చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'తుంబాడ్'కు కొనసాగింపుగా తెరకెక్కుతున్న 'తుంబాడ్ 2'పై మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ప్రముఖ నటి ఆలియా భట్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని హీరో, నిర్మాత సోహుమ్ షా సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రకటనతో 'తుంబాడ్ 2'పై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. సోహుమ్ షా తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఆలియా భట్‌తో కలిసి దిగిన చిత్రాలను పంచుకుంటూ, కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. 'తుంబాడ్ 2'లోకి ఆలియా భట్‌కు స్వాగతం అంటూ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా, ఉత్కంఠభరితంగా సాగనున్నట్లు చిత్రబృందం సంకేతాలు ఇచ్చింది. ఈ చిత్రంలో భాగం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆలియా భట్ తెలిపారు. తొలిసారి 'తుంబాడ్' చిత్రాన్ని చూసినప్పటి నుంచే ఆ కథ, ఆ ప్రపంచం తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. అలాంటి విభిన్నమైన కథలో నటించే అవకాశం రావడం తనకు ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి ప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేయాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆమె వెల్లడించారు. చిత్రబృందం తెలిపిన వివరాల ప్రకారం, ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్ర మాత్రమే కాకుండా కథను కీలక మలుపు తిప్పే శక్తివంతమైన పాత్రగా ఉండనుంది. ఆమె పాత్ర చుట్టూనే సినిమా ప్రధాన మలుపులు తిరిగేలా కథను రూపొందిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సీక్వెల్‌లో ఆలియా పాత్రకు విశేష ప్రాధాన్యం ఉండబోతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. దాదాపు వంద కోట్ల రూపాయల వ్యయంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న 'తుంబాడ్ 2'కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. తొలి భాగం సృష్టించిన మాయాజాలాన్ని మరింత విస్తృత స్థాయిలో చూపించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. భయానక అంశాలతో పాటు జానపద నేపథ్యం, ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2027 డిసెంబర్ 3న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. తొలి భాగానికి లభించిన ఆదరణను దృష్టిలో ఉంచుకుని 'తుంబాడ్ 2'ను మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారు. ఆలియా భట్ చేరికతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. అభిమానులు ఇప్పుడు ఈ సినిమా నుంచి మరిన్ని అప్‌డేట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అమరావతి నిర్మాణానికి కొత్త ఊపు

## – మంత్రి నారాయణతో సింగపూర్ బృందం భేటీ – ప్రణాళిక, సాంకేతిక సహకారానికి పునరుద్ఘాటన





మన గళం, అమరావతి : అమరావతి రాజధాని అభివృద్ధిలో సింగపూర్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక సమావేశం నిర్వహించారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్‌తో పాటు సింగపూర్ సహకార సంస్థ ప్రతినిధులతో సమావేశమై అమరావతి అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర నగరాభివృద్ధి వంటి అంశాలపై సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలను ఇరు పక్షాలు చర్చించాయి. ప్రపంచ స్థాయి రాజధాని నగర నిర్మాణంలో సింగపూర్ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికా సహకారం, సాంకేతిక నిపుణుల సేవలు, సామర్థ్య పెంపు, శిక్షణ, సలహా సేవలను కొనసాగించేందుకు సింగపూర్ ప్రభుత్వం మరోసారి తన నిబద్ధతను పునరుద్ఘాటించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ భాగస్వామ్యం అమరావతి నిర్మాణానికి మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలలుగంటున్న ప్రపంచ స్థాయి రాజధాని నగర నిర్మాణంలో సింగపూర్ సహకారం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు, ఆధునిక నగర నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతిని పెట్టుబడులు, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని నారాయణ వివరించారు. ఈ దిశగా ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు, దేశాలతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తున్నట్లు తెలిపారు.

సింగపూర్‌తో కొనసాగుతున్న దీర్ఘకాలిక భాగస్వామ్యం అమరావతి అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక, సుస్థిర, ప్రపంచ స్థాయి రాజధాని నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

# గంభీర్‌కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలా?



మన గళం, లండన్ : భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మరోసారి విభేదాలు తలెత్తాయా అనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు ముందు నిర్వహించిన సాధనలో ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించిన సాధన దృశ్యాలు అభిమానుల మధ్య చర్చకు దారితీశాయి. సాధన సమయంలో గౌతమ్ గంభీర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో పాటు ఇతర కోచింగ్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు కనిపించింది. అయితే మొత్తం ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీతో ఆయన ప్రత్యక్షంగా మాట్లాడిన దృశ్యాలు కనిపించలేదని పలు కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు కోహ్లీ తన బ్యాటింగ్ సాధనను సితాన్షు కోటక్ పర్యవేక్షణలో పూర్తి చేసి, అనంతరం ఆయనతో కొంతసేపు సాంకేతిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. గతంలో ఐపీఎల్ సందర్భంగా గౌతమ్ గంభీర్, విరాట్ కోహ్లీ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. అనంతరం గంభీర్ భారత జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇద్దరూ వృత్తిపరంగా కలిసి పనిచేస్తూ కనిపించారు. అయితే ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలో సాధన సమయంలో ఇద్దరూ మాట్లాడుకోలేదన్న ప్రచారం మళ్లీ పాత విభేదాలపై ఊహాగానాలకు కారణమైంది. అయితే గౌతమ్ గంభీర్, విరాట్ కోహ్లీ మధ్య విభేదాలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి లేదా జట్టు యాజమాన్యం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధన సమయంలో మాట్లాడుకోకపోవడం మాత్రమే ఆధారంగా విభేదాలు ఉన్నాయని నిర్ధారించే అవకాశం లేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీ20 సిరీస్‌లో ఘోర పరాజయం అనంతరం వన్డే సిరీస్‌లో విజయంతో పుంజుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో జట్టులో ఐక్యత కొనసాగించడం అత్యంత ముఖ్యమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సూర్యకు ఇంకా ముగియలేదు..



మన గళం, ముంబై : భారత జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు టీమిండియా తలుపులు పూర్తిగా మూసుకుపోలేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి వర్గాలు స్పష్టం చేశాయి. ఇటీవల బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో అతడిని టీ20 కెప్టెన్సీ నుంచి తప్పించడమే కాకుండా జట్టులోనూ చోటు దక్కలేదు. అయినప్పటికీ దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా పరుగులు సాధిస్తే మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చే అవకాశం ఉంటుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టును విజేతగా నిలిపిన సూర్యకుమార్ యాదవ్.. అనంతరం ఫామ్ కోల్పోవడంతో ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపిక కాలేదు. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు టీ20 జట్టు పగ్గాలు అప్పగించారు. అయితే కొత్త కెప్టెన్ నాయకత్వంలో భారత జట్టు వరుస పరాజయాలు చవిచూసింది. ఐర్లాండ్‌తో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో 2–0 తేడాతో వైట్‌వాష్‌కు గురైన టీమిండియా.. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను కూడా 4–0 తేడాతో కోల్పోయింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఈ వరుస వైఫల్యాల నేపథ్యంలో సూర్యకుమార్ భవిష్యత్తుపై చర్చ మొదలవగా.. బీసీసీఐ వర్గాలు స్పందించాయి. ప్రస్తుతం అతడు జట్టు ప్రణాళికల్లో లేకపోయినా, దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తే మళ్లీ ఎంపికకు అర్హుడవుతాడని స్పష్టం చేశాయి. ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు ఇంకా ఉన్నాయని పేర్కొన్నాయి. మరోవైపు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత జట్టు ప్రదర్శన తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టీ20లో 56 పరుగుల తేడాతో ఓడిన భారత్.. అంతకుముందు నాలుగో మ్యాచ్‌లో 9 వికెట్లు, మూడో మ్యాచ్‌లో 125 పరుగులు, రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది.

# టీమిండియాకు మరో షాక్..

## – అసిస్టెంట్ కోచ్ పదవికి డస్కేట్ రాజీనామా?



మన గళం, లండన్ : వరుసగా ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో టీ20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీమిండియా సహాయక కోచ్ రియాన్ టెన్ డస్కేట్ తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాల వల్ల బాధ్యతల నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని ప్రధాన కోచ్ గౌతం గంభీర్‌తో పాటు భారత క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ అనంతరం అతని పదవీకాలం ముగియనుంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత జట్టు వరుస వైఫల్యాలు చవిచూడడంతో ఆటగాళ్లతో పాటు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తొలి వన్డే జరుగుతుండగానే డస్కేట్ రాజీనామా వార్త వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. తనను సహాయక కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆయన బీసీసీఐ, ప్రధాన కోచ్ గౌతం గంభీర్‌ను కోరినట్లు సమాచారం. డస్కేట్ కుటుంబం ప్రస్తుతం లండన్‌లో నివసిస్తోంది. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉండగా, ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబాన్ని చూసుకోవడం తన భార్యకు కష్టంగా మారిందని తెలుస్తోంది. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. భారత జట్టు పర్యటనల కారణంగా తరచూ విదేశీ ప్రయాణాలు చేయాల్సి వస్తుండటంతో ఇకపై లండన్‌లోనే ఉంటూ కోచింగ్ వృత్తిని కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో బీసీసీఐతో ఆయన ఒప్పందం కూడా ముగిసినట్లు సమాచారం. అయితే డస్కేట్ రాజీనామాపై ఇప్పటివరకు గౌతం గంభీర్ గానీ, బీసీసీఐ గానీ అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన అభ్యర్థనను అంగీకరిస్తే ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ అనంతరం టీమిండియా సహాయక కోచ్‌గా ఆయన ప్రస్థానం ముగియనుంది. నెదర్లాండ్స్ మాజీ క్రికెటర్ అయిన రియాన్ టెన్ డస్కేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కోల్‌కతా నైట్ రైడర్స్ కోచింగ్ బృందంలో గౌతం గంభీర్‌తో కలిసి పనిచేసిన ఆయనను, గంభీర్ టీమిండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత జట్టు కోచింగ్ సిబ్బందిలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన భవిష్యత్తుపై బీసీసీఐ తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

# ఇంగ్లండ్‌కు భారత పేసర్ల షాక్..



మన గళం, బర్మింగ్‌హామ్ : ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత పేసర్లు అద్భుత బౌలింగ్‌తో ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టారు. యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు పడగొట్టగా, దాదాపు మూడేళ్ల తర్వాత వన్డేల్లోకి తిరిగి వచ్చిన జస్ప్రీత్ బుమ్రా కూడా తన తొలి స్పెల్‌లోనే కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను పెవిలియన్‌కు పంపించాడు. దీంతో ఇంగ్లండ్ 15 ఓవర్లు ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత ఓపెనర్లు బెన్ డకెట్, జాకబ్ బెథెల్ జట్టుకు శుభారంభం అందించినా, పవర్‌ప్లే అనంతరం భారత బౌలర్లు పట్టు బిగించారు. గుర్నూర్ బ్రార్ వేసిన ఓవర్లో రెండో బంతికే జాకబ్ బెథెల్ 14 పరుగుల వద్ద ఔటయ్యాడు. అదే ఓవర్లో నాలుగో బంతికి భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన బెన్ డకెట్ బౌండరీ వద్ద జస్ప్రీత్ బుమ్రా అందుకున్న అద్భుత క్యాచ్‌తో 43 పరుగుల వద్ద వెనుదిరిగాడు. ఆ వెంటనే బుమ్రా తన తదుపరి ఓవర్లో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను కేవలం ఒక పరుగు వద్ద స్లిప్‌లో రోహిత్ శర్మ చేతికి క్యాచ్ ఇవ్వించి పెవిలియన్‌కు పంపించాడు. వరుసగా మూడు కీలక వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ కుదేలైంది. ప్రస్తుతం జో రూట్, జోస్ బట్లర్ క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. 15 ఓవర్లు ముగిసే సమయానికి ఇంగ్లండ్ స్కోరు 3 వికెట్ల నష్టానికి 74 పరుగులు. భారత బౌలర్ల ధాటికి మ్యాచ్‌పై టీమిండియా పట్టు బిగిస్తున్నట్లు కనిపిస్తోంది.

# ఫిఫా ఫైనల్‌కు బెంగళూరులో అర్ధరాత్రి వరకు హోటళ్లకు అనుమతి



మన గళం, బెంగళూరు : ఫిఫా వరల్డ్ కప్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు వీలుగా బెంగళూరులోని హోటళ్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి తర్వాత కూడా పనిచేసేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జులై 15, 16 తేదీల్లో జరిగే సెమీ ఫైనల్స్‌తో పాటు జులై 20న జరిగే ఫైనల్ మ్యాచ్ సందర్భంగా హోటళ్లు, రెస్టారెంట్లు సాధారణ సమయం కంటే ఎక్కువసేపు సేవలు అందించవచ్చు. రాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 3.30 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారాలను ఏర్పాటు చేసి, ఆహార సేవలు కొనసాగించేందుకు అనుమతి కల్పించారు. ఈ నిర్ణయాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఫుట్‌బాల్ అభిమానుల కోసం ఈ ప్రత్యేక సౌకర్యాన్ని కల్పిస్తున్నప్పటికీ, ప్రజల భద్రత, శాంతిభద్రతలు, నగరంలో సామాన్యుల సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. మ్యాచ్‌లను వీక్షించే అభిమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని డీకే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయంతో బెంగళూరులోని ఫుట్‌బాల్ అభిమానులు పెద్ద ఎత్తున హోటళ్లు, రెస్టారెంట్లలో చేరి ప్రపంచకప్ ఉత్కంఠభరిత పోరులను ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం లభించనుంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.